(మినీకథ)

# మొగుడూ పెళ్ళాం

## చెంగల్వ



రావుడు కూలిచేసి బతుకుతున్నాడు. ఆడిమీద బతికే వాళ్ళు ఇద్దరే అయినా ఆ యిద్దర్నీ సాకడానికే ఆడికి తల ప్రాణం తోకకి వస్తోంది.

రావుడి పెళ్లాం "మంగి" చాలా బాగుంటుంది. ఆ పల్లెలో పెద్దకాపులందరూ దాన్ని "మరదలా" అనే పిలుస్తారు ప్రేమగా. పాపం కులం తక్కువది. అది మాత్రం ఏం చేయగల్దు?

అప్పటికీ ఒకటి రెండుసార్లు కాపుల కుర్రాళ్లు దాన్ని అటకాయిస్తుంటే, ఉండబట్టలేక రావుడుకి చెప్పుకునేడ్చింది.

"అంత దిర్రుగా కచ్చాపోసుకుని కాళ్ళంతా కనిపించేలా ఈదిలోకెళ్ళకపోతే. - ఆళ్ళకంట బడతావ్! నీదొక ఎధవేసం" కసురుకున్నాడు రావుడు.

"పౌరుసంలేనెధవ్వి నామీదిరుసుకు పడతావేం? నేనక్కడ రికాడేస్నాడానికి ఎల్లలేదు. కోమటి కొట్టుకాడ ఎచ్చాలకెల్లాను. ఎధవ పౌరుసం ఎధవ పౌరుసమని!" రెట్టించింది మంగి.

ఊరందరికీ లోకువయినా పర్లేదుకానీ, పెళ్లానికి మాత్రం లోకువవ్వడం నిజంగానే పౌరుషం వచ్చింది రావుడికి. ఆవేళంతా గంజాయినా ముట్టకుండా మూల కూర్చున్నాడు, ముంగిలాగ్గ.

రావుడి కొడుకు 'అబ్బి' గాడికి అడి అమ్మ, అయ్య గొడవ పడితే చాలాచిరాకు. అందుకే ఆడు కూడా గంజి ముట్టలేదా రేతిరి వరకూ.

మంగికి ఏడుపొచ్చింది. ఆ పూటంతా కంటి ధారగా ఏడ్చింది. అయ్య ఏమీ అవకుండానే అదేడుస్తూ కూర్చోడం అర్థం కాలేదు అబ్బికి, కొంత సేపటికి ఆళ్ళ మానాన ఆళ్ళ నొదిలేసి గోటీం బిళ్ళాడుకోడానికి తుర్రు మన్నాడు.

మంగికి చచ్చిపోవాలనిపించింది, "ఎదవ అందం దేవుడు నాకెందుకిచ్చాడ'ని అది మొత్తుకుంది.

"అందం ఇచ్చి మాల కొంపల్లో ఎందుకు పుట్టించావురా" అని దేవుణ్ణి తిట్టుకుంది.

అందం ఉన్నా, కులం లేకపోయినా పౌరుసం లేని మగాడికి ఆడదాన్నెందుకు చేశావురా' అని దేవుణ్ణి శాపనార్థాలు పెట్టింది.

కాచిన గంజి గుక్కెడైనా తరగకుండానే తెల్లారింది. రావుడులేస్తూనే పందుంపుల్ల నోట్లో పెట్టుకుని కూలి పనికెళ్ళిపోయాడు. కాపుదూళ్ళని ఇప్పుకుని అబ్బిగాడు గరువుమీద కెళ్ళిపోయాడు.

నీర్సంగా కళ్ళు తెరిచింది మంగి. సూరీడు పైపైకి వచ్చేస్తన్నాడు. గబగబాలేచి ప్రెసిడెంటుగారింటికి పాచి పనికెళ్ళిపోయింది.

• • •

ప్రెసిడెంటు గారికి ఒక్కర్తే కూతురు. ఆ అమ్మాయి పేరు లక్ష్మి. ఏడాది క్రితం వరకూ పట్నంలో బి. కాం. చదువుకుంది లక్ష్మి. చదువైపోగానే అక్కడే ఒక కుర్రాణ్ని చూశాడు ప్రెసిడెంటు. ఆ కుర్రాడికి లక్షల ఆస్తుంది. అందుకే ప్రెసిడెంటు వాళ్ళిద్దరికీ ఘనంగా పెళ్ళిచేశాడు.

అల్లుడికి ఏ ఉద్యోగమూ లేదు. అత్తగారింట్లోనే ఇల్లరికం వచ్చేశాడు.

లక్ష్మి అందంగా ఉంటుంది. వయస్సు ఇరవైకి మూడెక్కువగా ఉంటాయి. బంగారు రంగులో మిస మిసలాడుతూంటుంది. ఆమె భర్తకి కూడా అందంలో తక్కువేం కాదు. ఆమాటకొస్తే ధైర్యం కూడా తక్కువకాదు. పోయిన కోడి పందాల్లో ఏదో గొడవొచ్చి ఇరవైమందిని అతనొక్కడే తుక్కు తుక్కుగా కొట్టేశాడు.

మంగి వచ్చిరావడంతో దేవోట్లో బ్రష్‌తో పెరట్లో కనబడ్డాడతను. అతన్ని చూడగా "ఇటువంటి పెనిమిటి నాకుంటే ఎంత బాగుండునో' అనుకుంది మంగి.

ఇంట్లో అంట్లెయ్యడానికి ఎవరూ కనబడలేదు మంగికి. "బాబుగారూ. పెద్దమ్మగారు లేరా" అనడిగిందతన్ని.

"అందరూ పట్నానికి పెళ్ళికెళ్లారు" సమాధానం చెప్పి తీరగా చూశాడు దాని వంక.

మంగి అర్ధనగ్నంగాకనబడుతోందతనికి. బొడ్డు కిందకి చీర

కట్టింది.

కచ్చా బిగించి కట్టిందేమో తొడలు ఊరిస్తున్నట్టు కనిపిస్తున్నయ్ బలిష్టంగా. పైట ముడుచుపోయి రొమ్ముల మధ్యగా వెనక్కెళ్ళి పోయింది. కుడిపక్క రొమ్ముకింద పేదరికపు బిరుగులోంచి గుండె సగం కిందికి జారింది.

నోటనున్న బ్రష్ తీసి, తుపుక్కున యింత తెల్లగా నురుగు ఉమ్మేశాడతను. రెండడుగులు వేశాడు దాని దగ్గరకి. ఝడుసుకున్నట్టుగా వెనక్కి జరిగి కచ్చా కింద కొదిలేసింది. లంగా, పైటని పూర్తిగా యితమర్చి గుండెల నిండా కప్పుకుంది.

''అలా భయపడ్తావేంటి? నేనేమన్నా రాక్షసుడినా? పడగ్గదిలో కెళ్ళు....నే నిప్పుడే వస్తా'' అన్నాడతను.

''కాపుగారూ. నేనేటనుకుంటున్నారు? జాగర్తగా మాట్టాడండి'' ఉరిమి చూసింది మంగి.

''అయ్యబాబో. నిన్నే మంటల్లేదే, లోపల పడగ్గదిలో మీ చిన్నమ్మగారుంది ఎల్లమంటున్నానంతే'' వెటలిగా నవ్వాడతను.

ఒక్క పరుగున లోపలికెళ్ళింది మంగి. పడగ్గదిలో సన్నగా మూలుగు వినబడుతోంది. లోపలికెళ్ళింది. మంచానికి అడ్డంగా పడుంది లక్ష్మి.

వొంటిమీద జాకెట్టు లేదు. చీర మాత్రం కడుపు వరకూ పైన కప్పినట్టుగా పరిచుంది. కాళ్ళు రెండూ బారచాపి, కళ్ళు రెండూ తెరుచుకుని, బలహీనంగా చూస్తోంది లక్ష్మి.

మంగికి మతిపోయింది. దెయ్యాన్ని చూసి ఉలిక్కి పడ్డట్టయింది దానికి.

''సిన్నమ్మ గారూ!'' అరుస్తూ మంచం మీద కొంగుంది మంగి.

కీచుగా అరిచి పక్కకి జరిగి పోయింది లక్ష్మి బాధగా.

దగ్గరగా మొహం పెట్టి పరీక్షగా చూసింది మంగి.

లక్ష్మి గుండెల మీద చింతపిక్కంత బొబ్బలు చట్టంత ఉన్నాయ్. పెదాల మీద కూడా అలాగే మచ్చలున్నాయ్. కాళ్ళు, తొడల మీద మాత్రం నల్లగా మాడిపోయిన పుళ్ళ గుర్తులున్నాయ్.

కళ్ళు తిరిగినాయి మంగికి చుట్టూ చూసింది. గదిలో చిందరవందరగా పడున్నాయి సిగరెట్టు పీకలు. లక్ష్మి వొంటిమీద ఉన్న బొబ్బలు ఆ సిగరెట్టులతో పెట్టినవే అని గుర్తు పట్టేసిందది. పరిగెట్టుకుంటూ వెళ్ళి గ్లాసుడు నీళ్ళు తెచ్చి లక్ష్మి మొహం మీద చిలకరించింది. ఓ అర గ్లాసుడు నీళ్ళు తాగించింది.

కాస్త కదిలింది లక్ష్మి——

'మంగీ ఎళ్ళిపోవే. ఇక్కడ అంతా రాక్షసులేనే. నిన్ను కూడా బతకనివ్వరు వెళ్ళిపోవే. అసలే అమ్మ, నాన్నా లేరు - నువ్వెళ్ళిపోవే....మంగీ..'' ఏడ్చిందామె—మూలిగినట్టు.

ఊరుకో బెట్టింది మంగి.

ముందస్తంగా అది తెలివిగా చేసిన పని ఆ గది తలుపులన్నీ మూసేసి గొళ్ళేలు పెట్టేయడం.

ఆ సాయంత్రానికి వచ్చాడు ప్రెసిడెంటు, భార్యతో సహా.

అప్పటి వరకూ మంగి ఆ గదిలోనే ఉండిపోయి లక్ష్మికి సేవచేస్తూ కూర్చుంది. ఏ క్షణంలో లక్ష్మి చచ్చిపోతుందో నని దాని భయం.

లక్ష్మి మొగుడు మెల్లగా పట్నానికి జారిపోయేడు.

ప్రెసిడెంటు వచ్చి తలుపులు కొట్టాడు.

ఎవరో చెప్పకుండా తలుపు తియ్యనంది మంగి.

కోప్పడి, చిరాకు పడి చివరికి తన ఉంగరం లోపలికి.... తలుపు సందుగుండా పడేశాడు ప్రెసిడెంటు. మంగి అప్పటికి అతన్ని గుర్తుపట్టి తలుపులు తీసింది.

పెద్దమ్మ గార్ని చూసి అమాంతం ఏడుపు లంకించుకుంది.

మరో అరగంటకి అమ్మ చేతుల్లోనే మూలుగా పేసింది లక్ష్మి.

మంగికి జరమొచ్చినట్టయ్యి గుడిసెకి పరుగు తీసింది.

ప్రెసిడెంటూ, పెళ్ళామూ ఏడ్చారు; మొత్తుకున్నారు. అసలికి కల్లా ఆ బిడ్డ పడ్డ కష్టాన్ని కనిపెట్ట గలిగింది....

ప్రతిరోజూ బిడ్డ ఇలాగే హింస పడుతోందనీ, అయితే తామెవ్వరమూ లేక గతరాత్రి ఆ పైశాచికత్వం విచ్చలవిడిగా నర్తించిందనీ, ఆ తల్లి గ్రహించగలిగింది.

గుట్టుచప్పుడు కాకుండా, అసలు విషయం బైట పడకుండా రాత్రికి రాత్రే లక్ష్మిని బూడిద చేశారు.

అర్ధరాత్రిదాటి ఓ జామయ్యుంటుంది.

గజగజమని వణుకుతోంది మంగి.

కింద చాపమీద అబ్బుగాడు గురకెడతన్నాడు.

రెండో కట్టలో మొదటి బీడీ తాగి రావుడు గుడిసెలోపలికొచ్చాడు. సూరుకి ఏలాడతన్న గుడ్డి దీపాన్ని వొత్తి పెంచి మంగి దగ్గర కెళ్ళి చూశాడు.

కళ్ళు తెరిచి భయం భయంగా చూస్తోందది.

''మంగీ అయ్యిందేదో అయిపోయింది. కూసింత గంజిగుటకయ్యే!'' అది గొంతు జీర పోయింది.

''ఇయ్యాల్టికి మూడు పూటల్నించి గంజైనా ముట్టలేదు. నువ్విలా మొండికెత్తే, నేనన్నమాటలే పట్టించుకుని 'గంజితాగకుండా ఈ రేతిరి కూడా మూడంకేత్తే.... నేను సచ్చినంతొట్టు!''

ఎండిలోతుకు పోయిన మంగి పొట్టమీద పడ్డాయి వాడి కన్నీటి సుక్కలు రెండు.

అమాంతం లేచి ఆణ్ని వాటేసుకుంది మంగి. బావురుమని ఏడ్చేసింది.

''మంగే.'' రావుడూ ఏడ్చేశాడు. అదెందుకు ఏడుస్తోందో తెలవక ఆడికీ ఏడుపొచ్చేసింది.

''మావా నువ్వే మామా నా మగాడివి. నువ్వేమావా. ఇప్పుడే కాదు. ఆ దేవుడే ఏడేడు జనమలకీ నిన్నే నా మగాణ్ని చేయాలి మామా.''

తన ఆలోచనలు కరిగి కరిగి నీరైపారే దాకా ఏడుస్తూనే ఉంది. ●




నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి. చర్మ వ్యాధులనుండి విముక్తులు కండి. హస్త ప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్రస్ఖలనము, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స! పోస్టు ద్వారా చికిత్స కలదు.

**"క్యాంపులు"**: ప్రతి ఆదివారం **'భీమవరం'** షణ్ముఖ లాడ్జిలో ఉదయం 8 గం. నుండి సాయంత్రం 6-30 గం. వరకు. ప్రతి నెల 1 మరియు 16 తేదీలలో **'రాజమండ్రి'** **హోటల్ అశోకాలో కోటగుమ్మం దగ్గర మధ్యాహ్నం 12 గం. నుండి రాత్రి 9 గం. వరకు.**

# డా॥ డి. మార్కండేయులు

**ఆయుర్వేద భిషక్, సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్**

**పార్కురోడ్, గుడివాడ - 521301**

**ఫోన్స్ : 522 & 540**